క్లుప్తంగా

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

కలసపాడు : గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం తహసీల్దారు మధురవాణికి వీఆర్ఏలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 సంవత్సరాలుగా చాలీచాలని జీతంతో కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 18, 19వ తేదీల్లో తహసీల్దారు కార్యాలయం ఎదుట, 20వ తేదీన ఆర్డీఓ కార్యాలయం ఎదుట, 22న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏలు స్టీవెన్, ప్రభాకర్, పాండు, అన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

ప్రొద్దుటూరు : యువత రాజకీయాల్లోకి రావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రజా సేవకుడిగా దేశాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ రక్తదాన శిబిరంలో బీజేపీ నాయకులు, శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు మొత్తం 82 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, బీరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అరకటవేముల హరినారాయణ, అరకటవేముల పృథ్వీనారాయణ, సీపీ జయలక్ష్మి, జిల్లా సెక్రటరీ జయలక్ష్మి, పర్లపాడు గౌరీశంకర్, కిరణ్‌కుమార్, నరేంద్ర, చలపతి, కంబగిరి, మురళీధర్, రామసుబ్బయ్య, ముత్యాల శ్రీశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అరకొర పనులతో ప్రజలకు ఇబ్బందులు

పోరుమామిళ్ల : పట్టణ ప్రధాన రహదారిలో నిర్మాణ మవుతున్న డివైడర్ రోడ్డు పనులు త్వరగా చేయకుండా, అక్కడక్కడ అరాకొర పనులతో ప్రజలను, వాహనదారులను ఇబ్బందులు పెడుతున్నారని మానవ హక్కుల సంఘ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆ సంఘం కార్యదర్శి ఫణిరావు మాట్లాడుతూ సాయిబాబా మందిరం వద్ద సిమెంట్ రోడ్డుకు మట్టి తీసి పది రోజులు దాటినా రోడ్డు మాత్రం వేయలేదన్నారు. డ్రైనేజీ పని మొదలు పెట్టడమే కానీ సక్రమంగా కొలతలతో పని చేయకుండా ఇష్టారాజ్యంగా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేగంగా పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు.

గ్లోబల్ అవార్డు ప్రదానం

మైదుకూరు : మండలంలోని ముసల్నాయునిపల్లెకు చెందిన వీరమల్ల సాంబశివయ్య 108 అత్యవసర చికిత్స అంబులెన్స్‌లో అందించిన సేవలకుగాను ఛత్రపతి శివాజీ మహారాజ్ గ్లోబల్ అవార్డును ప్రదానం చేశారు. కేంద్ర సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ సహకారంతో నడుస్తున్న బెంగుళూరుకు చెందిన ఏనియల్ సంస్థ బుధవారం సాంబశివయ్యకు గ్లోబల్ అవార్డును అందజేసింది. ప్రమాదాలపై వచ్చిన సమాచారానికి తక్షణమే స్పందించి ప్రాణాలను కాపాడటం, రోగులకు సేవలు అందించడం, రక్తదానం, మొక్కలు నాటడం వంటి విశిష్ట సేవలకు ఈ అవార్డు అందజేస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. అదే విధంగా విజయవాడకు చెందిన మరో సంస్థ కొద్ది రోజుల కిందట సాంబశివయ్య సేవలను గుర్తించి సుభాష్‌చంద్రబోస్ ఐకాన్ అవార్డును అందజేసింది.

సగరులు రాజకీయంగా రాణించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : సగరులు రాజకీయంగా రాణించాలని రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణప్ప పేర్కొన్నారు. స్థానిక ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో బుధవారం సగర కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగరులు ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నారని చెప్పారు. విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణిస్తున్నా రాజకీయంగా పురోగతి లేదన్నారు. సగరులు ఐకమత్యంతో ముందుకు వెళితే ఏదైనా సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు సగర సంఘం నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సగర సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి నీలం బాలగంగాధర్ తిలక్, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మజ్జారి వీరమోహన్, ఉపాధ్యక్షుడు వరికూటి సుబ్బరాయుడు, కోశాధికారి జోడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వన్నంపల్లి వెంకటేష్, పట్టణాధ్యక్షుడు నశ్యం వెంకటసుబ్బయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

అంత్యక్రియలు

కాశినాయన : ఎవ్వరు లేని అనాథ వృద్ధురాలికి మేమున్నామంటూ వివేకానంద ఫౌండేషన్ సంస్థ బృందం మానవత్వాన్ని చాటుకుంది. నంద్యాల జిల్లా కానాల మండలం హైస్కూల్ కొట్టాలు గ్రామానికి చెందిన నరసమ్మ (90)కు నా అనే వారు ఎవ్వరు లేకపోవడంతో వివేకానంద సేవాశ్రమంలో చేర్పించారు. బుధవారం ఆమె మృతి చెందింది. సంస్థ ప్రతినిధులు సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి, సంస్థ ప్రతినిధులు వీరాస్వామి, వెంకటేశ్వర్లు, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రెండు బస్తాల యూరియా ఇవ్వాలి



చాపాడు: రైతులకు యూరియా అందించాలని ఏఓకు సూచిస్తున్న ఎంపీపీ



దువ్వూరు: మాట్లాడుతున్న ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి

చాపాడు : గత ప్రభుత్వ హయాంలో రైతులు కోరినంత మేరకు రైతు భరోసా కేంద్రాల్లో యూరియా సరఫరా చేశారని, కూటమి ప్రభుత్వంలో ఎకరాకు ఒక బస్తా యూరియా కూడా దొరకడం లేదని ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసుకున్న రైతులకు ఎకరాకు మూడు బస్తాల యూరియా అవసరం ఉంటుందని, ప్రభుత్వం ఒక బస్తానే ఇస్తోందని, కనీసం రెండు బస్తాలైన ఇవ్వాలన్నారు. గ్రామాల్లో అధికార పార్టీ నేతల ప్రమేయం లేకుండా పట్టాదారు పాస్‌పుస్తకం కలిగిన ప్రతి రైతుకు యూరియా అందించాలన్నారు. చాపాడు మండలంలో 15,850 ఎకరాల్లో వరి సాగైందని, దీనికి 2139.75 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకు 1000 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారని, మిగిలిన 1139.75 మెట్రిక్ టన్నుల యూరియాను పంపించాలని సమావేశంలో తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు ఎంపీపీ తెలిపారు.

ప్రజా సమస్యలపై చర్యలు తీసుకోవాలి

మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రభుత్వ అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు. వ్యవసాయానికి రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తున్నారని, దీని వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పగటి పూట విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఫిర్యాదులు చేసినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. చాపాడు మండలానికి ఇన్‌చార్జి ఇంజనీర్ కాకుండా శాశ్వత ఇంజనీర్లు నియమించాలన్నారు. మండలంలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులలో పంట కాలువలు దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో కొత్త కాలువలను ఏర్పాటు చేయాలని కేసీ కెనాల్ ఏఈ గురుమోహన్ రెడ్డికి సూచించారు. రైతుల ఫిర్యాదు మేరకు పనులు చేపడుతామని ఏఈ తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య అధికారులతోపాటు పంచాయతీ అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభకరుణమ్మ, ఎంపీడీఓ వీరకిశోర్, ఏఓ దేవి పద్మలత, వైద్యాధికారి శివప్రసాద్‌రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ సయ్యద్ ముంతాజ్ బేగం, పీఆర్ ఏఈ చంద్రమౌళి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో..

చాపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం ఎంపీపీ లక్షుమయ్య, ఉప ఎంపీపీలు బాల నరసింహారెడ్డి, శుభకరణమ్మ, ఎంపీడీఓ వీర కిశోర్ ముఖ్య అతిథులుగా పోషణ మాసోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుబ్బరతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించండి

దువ్వూరు : రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా యూరియాను అందించాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి అధికారులను కోరారు. బుధవారం మండల పరిషత్ సభాభవనంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులకు సరిపడా యూరియాను అందించాలని వ్యవసాయాధికారులకు చెప్పారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వస్తున్నాయని, మండలంలో కొన్ని చోట్ల జ్వరం, దగ్గు తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. సకాలంలో వైద్య సేవలు అందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. పంచాయతీల్లో వర్షం నీరు రోడ్లపై, గుంతల్లో నిలబడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి అమరనాథరెడ్డి మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని, మండలానికి ఇప్పటి వరకు 1056 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామని, రైతులకు అవసరం ఉన్న చోట ఇంకా యూరియాను తెప్పిస్తున్నామన్నారు. డ్వామా ఏపీడీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ దువ్వూరు మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 5,160 కుటుంబాల్లోని 8,225 మంది సభ్యులకు వంద రోజులు పనిదినాలు కల్పించామన్నారు. వీరికి వేతనాల రూపంలో రూ.5.65 కోట్లు ఇప్పటి వరకు చెల్లించామని, సామాజిక పనుల రూపంలో రూ.1.30 కోట్లు చెల్లించామన్నారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పీరుజాత రహమతున్నీసా, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరికృష్ణ, హౌసింగ్ డీఈ రమేష్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, మెడికల్ ఆఫీసర్ రోషిణి, ఏఈలు సుబ్రహ్మణ్యం, శివకుమార్, ఎంఈఓ రమణయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

బి.కోడూరు : ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా గురువారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు తెలిపారు. ఈ శిబిరంలో స్పెషలిస్ట్ వైద్య బృందం పాల్గొంటారని, ఈ శిబిరంలో మహిళలు, కిశోర బాలికలు, గర్భవతులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందజేస్తామన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

బి.కోడూరు : మండలంలోని ప్రభలవీడు, తుమ్మలపల్లె గ్రామాల్లోని విలేజ్ క్లినిక్‌లలో బుధవారం ఏపీ సాక్స్, దిశ కడప జిల్లా వారి ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఐ.ఈ.ఎల్. క్యాంపెయినింగ్ ద్వారా సచివాలయ సిబ్బంది సహకారంతో హెచ్ఐవీ, ఎయిడ్స్ సుఖవ్యాధులపై ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లింక్‌వర్కర్ స్కీమ్ సూపర్‌వైజర్ ఎస్.దర్బార్‌వల్లి, ప్రభలవీడు మాజీ సర్పంచ్ రామసుబ్బమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు జాహ్నవి, సాని, ఏఎన్ఎం సులోచనదేవి, మహిళా పోలీసు లక్ష్మిఈశ్వరి పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికలు విడుదల



ఉత్సవాల ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటీ సభ్యులు

బద్వేలు అర్బన్ : స్థానిక అమ్మవారిశాలవీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుండి అక్టోబర్ 3వ తేదీ వరకు జరిగే దేవీశరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రికలను బుధవారం ఆర్యవైశ్య వర్తక సంఘం కార్యవర్గం అమ్మవారిశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు మహాలక్ష్మి ఆలయం నుంచి 108 వెండి కలశాలతో అమ్మవారిశాల వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి అభిషేకం నిర్వహించి ఉత్సవాలు ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం అక్టోబర్ 3వ తేదీ వరకు ఆయా రోజులలో అమ్మవారికి వివిధ రకాల అలంకారాలు నిర్వహించి విజయదశమి రోజున గ్రామోత్సవం నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం కార్యదర్శి ఉరిమి శ్రీనివాసులు, కోశాధికారి భూపాలం నాగరాజారావు, ఉపాధ్యక్షులు జూటూరు నాగరాజ, యాదాళ్ళ కృష్ణమూర్తి, చలపాటి రవికుమార్, సత్యనారాయణ ప్రసాద్, దరిశా సుబ్బరాజ, జాయింట్ సెక్రటరీలు సుబ్బరాయుడు, సునీల్ కుమార్, సగళా రాధా కృష్ణమూర్తి, తుమ్మల పెంట వెంకటసుబ్బయ్య, గుబ్బా వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో 'కూటమి' చెలగాటం

ప్రొద్దుటూరు : కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషా విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిందన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ఓపీలు చూడటం లేదన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.2,500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యశ్రీని అమలు చేస్తే నేడు కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందని ధ్వజమెత్తారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రతి కుటుంబానికీ రూ.3వేలు ప్రీమియం చెల్లించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.2,500 కోట్లు చెల్లిస్తే, ఇన్సూరెన్స్ ద్వారా రూ.4,800 ఖర్చవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విషజ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. కానీ ఆరోగ్యశ్రీ సేవలు తాత్కాలికంగా నిలిపివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించి ఆరోగ్య శ్రీ సేవలను ప్రజలకు అందించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కేసు విషయమై మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ బుధవారం విచారణ చేశారు. ఎగువ రామాపురం గ్రామానికి చెందిన బి.లక్ష్మిదేవి ఈ నెల 14న స్థలం విషయమై కలసపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయంపై డీఎస్పీ గ్రామంలో విచారణ చేపట్టారు. ఈయన వెంట పోరుమామిళ్ళ సీఐ శ్రీనివాసులు, పోలీసులు ఉన్నారు.

ఘన నివాళి

బి.కోడూరు : మండల కేంద్రానికి చెందిన మాజీ వీఆర్‌ఓ కర్ణం చెన్నారెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి బుధవారం ఆయన స్వగృహానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ దావీదు, మాధవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మునిరెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల అక్రమాలపై విచారణ చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ఎయిడెడ్ పోస్టుల భర్తీ విషయంలో 2024–2025 విద్యా సంవత్సరంలో ఆర్‌సిఎం ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ 24మంది ఉపాధ్యాయ నియామకాలను నిర్వహించే క్రమంలో ప్రభుత్వ ఉత్తర్వులు, జీవోలను పూర్తిగా ఉల్లంఘించారని పీడీఎస్‌యు, ఎఐఎస్‌బి, పీఎస్‌యు నాయకులు అంకన్న, సుబ్బరాయుడు, జయవర్ధన్‌లు ఆరోపించారు. వాటిపై విచారణ జరపాలని కోరుతూ బుధవారం డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.

ఉచిత కుట్టుశిక్షణ ప్రారంభం



కుట్టుమిషన్, సర్టిఫికెట్ అందచేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి

పోరుమామిళ్ల : మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి, శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందచేసి, వారికి జీవనోపాధి కల్పించడం గొప్ప సేవాకార్యక్రమమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్లలో మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రయాన్స్ టైలరింగ్ సెంటర్ రెండవ బ్యాచ్‌ని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ప్రారంభించారు. అదే సమయంలో ఆరు నెలల క్రితం బ్రయాన్స్ కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి 20 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోవింద రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మదర్ థెరెసా ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి గిరిప్రణీత్ రెడ్డి, నిర్వాహకులు అమితారెడ్డి, ప్రజ్వలారెడ్డి అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, వైస్ ఎంపీపీలు సీయం బాష, చెన్ను రాజశేఖర్, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు రాళ్లపల్లె నరసింహులు, రాజీవ్‌బాష, రాజారెడ్డి, చాపాటి నారాయణరెడ్డి, టేకూరుపేట సర్పంచ్ రమణారెడ్డి, ఎంపీటీసీ చెంద్రాయుడు, ఉప సర్పంచ్ రుద్రవరం ప్రసాద్, విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన



సేంద్రియ ఎరువుల తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

గోపవరం : మండలంలోని టీ.సండ్రపల్లె, ఎస్.రామాపురం గ్రామాల్లో బుధవారం ఏఓ విజయరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బద్వేలు ఏడీఏ వెంకటసుబ్బయ్య పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడటం వలన పంటలకు వివిధ తెగుళ్ళు వ్యాపించే అవకాశం ఉందని, దీని వలన పురుగు మందులు అధికంగా వాడాల్సి ఉంటుందన్నారు. అధిక శాతం మంది రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. సీజన్ ప్రారంభమైన వెంటనే పంటలు సాగు చేసిన రైతులు ఈ–పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ–పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు వర్తిస్తాయని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల తయారీపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ ఓబయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి, ఓబులేసు, సునంద తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసైన యువతను మారుద్దాం



అవగాహన పత్రాలను ఆవిష్కరిస్తున్న పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : యువత ఉజ్వల భవిష్యత్తు, బాధ్యత మనందరిపై ఉందని డీఎస్పీ భావన తెలిపారు. బుధవారం స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నివారణపై అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి విక్రయాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దాడులు ముమ్మరంగా చేపట్టడంతో గంజాయి వ్యసనానికి అలవాటు పడ్డ యువత ఇతర ప్రత్యామ్నాయ మార్గాల్లో మత్తు కలిగే మందుల కోసం మెడికల్ షాపులకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించొద్దని తెలిపారు. ఈగల్ ఇన్‌చార్జి, ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో యువతకు కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. మెడికల్ షాప్‌లకు మత్తు కలిగించే మందుల కోసం ఎవరైనా వస్తే అలాంటి వారి సమాచారాన్ని పోలీస్ శాఖకు తెలియజేయాలని సూచించారు. జిల్లా డ్రగ్ ఏడీ నాగకిరణ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యులు వ్యాధి నయం చేసేందుకు ఉద్దేశించి రాసిన ప్రిస్క్రిప్షన్ ఉన్న వారికి మాత్రమే మందులను విక్రయించాలని సూచించారు. ప్రిస్క్రిప్షన్ తీసుకొచ్చినా టీనేజ్ వారికి ఎట్టి పరిస్థితుల్లో మత్తు మందులు ఇవ్వకూడదన్నారు. జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.నరసింహమూర్తి, కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ యువతను వ్యసనాల నుంచి విముక్తి చేయడంలో పోలీస్ శాఖకు తమ పూర్తి సహకారం అందిస్తామన్నారు. అనంతరం కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సభ్యుల చేత పోలీసులు డ్రగ్స్ నిరోధానికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి, టూటౌన్ సీఐ సదాశివయ్య, త్రీటౌన్ సీఐ వేణుగోపాల్, ఈగల్ సిబ్బంది, మెడికల్ షాప్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి స్థలాల పరిశీలన



వేములూరు వద్ద సోమశిల వెనుకజలాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

అట్లూరు : మండల పరిధిలోని పలు పాఠశాలల్లో స్మార్ట్ కిచెన్ల నిర్మాణాలకు సంబంధించి స్థలాలను బుధవారం బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) చంద్రమోహన్ పరిశీలించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయానికి ఆయన వెళ్లి తహసీల్దార్‌తోపాటు సిబ్బందిని కలిసి అట్లూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎస్.వెంకటాపురం, కమలకూరు, వేములూరు పాఠశాలల పరిధిలో స్మార్ట్ కిచెన్ల నిర్మాణాలకు సంబంధించి స్థలాలను పరిశీలించారు. అక్కడి స్థితిగతులు, పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం వేములూరు సమీపంలోని సగిలేరు లోలెవెల్ వంతెనను ఆర్డీఓ పరిశీలించారు. సోమశిల వెనుక జలాల్లో వాహనాల రాకపోకలు, అవతలి ఒడ్డుకు, ఇవతలి ఒడ్డుకు ప్రజల రాకపోకల ప్రమాదకర పరిస్థితులపై స్థానికులతోపాటు తహసీల్దార్ సుబ్బలక్షుమ్మను అడిగి ఆర్డీఓ వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి విలియం రాజు, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, మండల సర్వేయర్ వేణుగోపాల్, వీఆర్ఓ సుబ్బన్న, వీఆర్ఏలు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు పోషకాహారం అందిస్తున్న సర్పంచ్, వైద్యాధికారి

కాశినాయన : ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ పుష్ప తెలిపారు. బుధవారం మండలంలోని గంగనపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ పథకాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ స్త్రీలకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. స్థానిక సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, పీహెచ్ఎన్ శారద, వైద్య సిబ్బంది చంద్రశేఖర్, శ్రీనాథ్, స్రవంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'తాగుబోతుల రాష్ట్రంగా మార్చేస్తున్నారు'



కరపత్రాలను విడుదల చేస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : తెలుగు రాష్ట్రాల్లో 30 ఏళ్లుగా మహిళల హక్కుల కోసం ఎన్నో నిర్బంధాలను అరెస్టులను ఎదిరించి పోరాడుతోంది చైతన్య మహిళా సంఘం అని రాష్ట్ర కమిటీ నాయకురాలు పద్మ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్జీఓ హోంలో చైతన్య మహిళా సంఘం 30 వసంతాలు పూర్తియిన సందర్భంగా ఈనెల 24న తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించే రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తూనే అదే రోజు మద్యం దుకాణాలకు పర్మిట్ రూములు ఇచ్చి అక్కడే మందు తాపిస్తున్నారన్నారు. అర్ధరాత్రి వరకు బార్లు తెరిచి ఉంచి మద్యం అమ్మకాలు సాగించవచ్చని ప్రభుత్వ పర్మిషన్లు ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల బాధలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్రాన్ని తాగుబోతుల రాష్ట్రంగా మార్చి తన ఖజానా నింపుకోడానికి మహిళల మానప్రాణాలను తాకట్టుపెడుతోందని విమర్శించారు. మద్యం, గంజాయిల వల్ల ఇప్పటికే మహిళలపై హింసా ఘటనలు పెరిగిపోయాయన్నారు. మహిళలను అన్ని విధాలా చైతన్యపరిచి వారి కుటుంబాలను, వారిని రక్షించుకునేలా సీఎంఎస్ అవగాహన పెంచడానికి కృషి చేస్తోందన్నారు. 24న జరిగే రాష్ట్ర సదస్సులో అందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్జీఓ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, ఉమెన్ వింగ్ చైర్మన్ జయమ్మ, విరసం వరలక్ష్మి, మహిళా శక్తి లక్ష్మీదేవి, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ రెడ్డి, మెప్మా ఆర్పీల సంఘం అధ్యక్షురాలు తనికంటి లక్ష్మీదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు చంద్రావతి, దళిత సమాఖ్య నాయకుడు ఎల్లయ్య, పీకేఎస్ నాగేంద్ర పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యవంతులుగా ఉండాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసమే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కామనూరు ఆరోగ్య కేంద్రంలో నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకం ద్వారా అన్ని రకాల వైద్య పరీక్షలు చేయడంతోపాటు మందులను పంపిణీ చేస్తారన్నారు. అనంతరం 311 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధీష్ణ, డాక్టర్ హనీబాబా, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ కవిత ప్రసన్న, డాక్టర్ శాంతి, డాక్టర్ యశస్విని, డాక్టర్ శ్రీలక్ష్మి, ఆప్తాలమిక్ ఆఫీసర్ రఘురామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, బచ్చల వీరప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

మైదుకూరు : మహిళల ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మండలంలోని వనిపెంటలో బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమం ద్వారా మహిళలకు సాధారణ జబ్బులతోపాటు పలు రకాల క్యాన్సర్ పరీక్షలను చేయనున్నట్టు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్ ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీకాంత్, తేజ్ దీప్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

చాపాడు : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తామని వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అల్లాడుపల్లెలో డాక్టర్ శివప్రసాద్ రెడ్డి, లక్ష్మీపేటలో డాక్టర్ కావ్య మాధురి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు అందించారు. స్త్రీలకు ఏవిధమైన ఆరోగ్య పరీక్షలు అవసరమైనా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు సూచించారు. ప్రధాన మంత్రి జన్మదినం సందర్భంగా పెట్టిన ఈ పథకాన్ని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు.

నాయీబ్రాహ్మణులకు న్యాయం చేయాలి

బద్వేలు అర్బన్ : ఇతర కులాలు ఏర్పాటు చేస్తున్న బార్బర్ షాపులను నియంత్రించి నాయీబ్రాహ్మణులకు న్యాయం చేయకుంటే కత్తి డౌన్ చేపడతామని చేతివృత్తిదారుల సంఘం పట్టణ కన్వీనర్ గంగనపల్లె నాగార్జున పేర్కొన్నారు. బుధవారం స్థానిక మజ్దూర్ యూనియన్ భవనంలో నిర్వహించిన నాయీబ్రాహ్మణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల జీవనవృత్తి అయిన బార్బర్ షాపులను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న తరుణంలో బద్వేలు, పోరుమామిళ్ళ ప్రాంతాల్లో ఇతర కులాలకు చెందిన వారు ఇతర రాష్ట్రాల నుండి కార్మికులను తీసుకువచ్చి కార్పొరేట్ స్థాయిలో బార్బర్ షాపులను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, వెంకటరమణ, రామసుబ్బయ్య పాల్గొన్నారు.